

భద్రతా సిబ్బందిని రెట్టింపు చేయాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి రోగులతో పాటు వచ్చే సహాయకులను ఒకరిద్దర్ని మాత్రమే ఆవరణలోకి అనుమతించే పద్ధతి ఉండాలి. వీరిని అరికట్టడానికి సెక్యూరిటీ వ్యవస్థ పటిష్టంగా ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్ట్ సిబ్బంది స్థానంలో పూర్తి బాధ్యతలు, విధులతో కూడిన సిబ్బందిని పెట్టాలి. ముఖ్యంగా మద్యం సేవించి వచ్చే వారికి లోపలికి అనుమతించకూడదు. పోలీసుల నిఘా కూడా ఏర్పాటు చేయాలి.

–డి.మహాలక్ష్మి, స్టాఫ్ నర్స్, అగనంపూడి ఏరియా ఆస్పత్రి



రాత్రి వేళ మహిళా పోలీసులు ఉండాలి



రాత్రి వేళల్లో మహిళా వైద్యులు డ్యూటీలో ఉన్న సమయంలో మహిళా పోలీసులను భద్రతగా ఉంచాలి. అగనంపూడిలాంటి ఆస్పత్రిలో రాత్రి వేళల్లో యాక్సిడెంట్ కేసులు వస్తున్నాయి. అలాగే గర్భిణులు డెలివరీ కోసం ఇక్కడికి వస్తున్నారు. ఆ సమయాల్లో వీరికి తోడుగా అధిక సంఖ్యలో వారి బంధువులు లోపలికి వచ్చేస్తున్నారు. అలాంటి సమయాల్లో కొంతమంది దురుసుగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ పరిస్థితులు లేకుండా ఉండాలంటే మహిళా పోలీసులను ఆవరణలో ఏర్పాటు చేస్తే మంచిది.

–బి.ఇందిరాలక్ష్మి, స్టాఫ్ నర్స్, అగనంపూడి

క్లుప్తంగా

నూతన వర్క్స్ సీజీఎం శ్రీధర్‌కు అభినందనలు



స్టీల్‌ప్లాంట్ నూతన సీజీఎం శ్రీధర్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జి ఉప్పలూరి శ్రీధర్‌ను స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన యూనియన్ అధ్యక్షుడు రమణారెడ్డి, కర్రి దాలినాయుడు నేతృత్వంలో నాయకులు ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని సీజీఎం కార్యాలయంలో శ్రీధర్‌ను కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మార్పుపూడి పరదేశి, పిట్టారెడ్డి, జి.అప్పలరాజు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, జనార్ధన్, బి.వి.రామయ్య, శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

80 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అగనంపూడి: అగనంపూడి వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. 80 మందికి ఉచితంగా సుగర్ పరీక్షలునిర్వహించారు. వాకర్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్. సత్యనారాయణ, గవర్నర్ రంగారావు మాట్లాడుతూ అగనంపూడి వాకర్స్‌క్లబ్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో అగనంపూడి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మండుగల నరసింగరావు, మురళీధరరావు, డొక్కా రమేష్, వనితా క్లబ్ ప్రతినిధులు గొల్లవిల్లి కనక భవాని, ఇంద్రాదేవి, జయమోహన్, జగదీష్ కుమార్, బి.రామారావు, కరణం పైడిరాజు, చిన్ని పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కును కాపాడుకుంటాం

అగనంపూడి: ఆంధ్రుల ఆత్మ గౌరవంతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకొనే శక్తి, యుక్తి రాష్ట్ర ప్రజలకు ఉందని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, హరనాథ్, సత్యనారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆదివారం వారు మాట్లాడారు. లక్షల కోట్ల విలువైన ఆస్తులు, లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును అతి తక్కువ ధరకు అమ్మేయాలని చూస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకోబోరన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.వి.రమణ, శీరంశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003-04 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం: రెండు దశాబ్దాల స్నేహ బంధం వారిది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. 2003–04 బ్యాచ్‌లో టెన్త్ పూర్తి చేసుకుని, బతుకు బాటలో ముందుకెళ్లారు. తామంతా మళ్లీ ఓసారి కలిసి, అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకోవాలనుకున్నారు. కొందరు విద్యార్థులు నడుం బిగించారు. వారి ప్రయత్న ఫలితంగా ఆదివారం వీరి తొలి ఆత్మీయ సమ్మేళనానికి స్థానిక జూనియర్ కళాశాల వేదికయింది. వీరిలో చాలా మంది 20 ఏళ్ల తర్వాత ఇప్పుడే కలుసుకోవడం. దీంతో ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, స్కూల్ డేస్‌ను గుర్తు చేసుకున్నారు. అప్పటి అల్లరి చేష్టల్ని చెప్పుకుంటూ ఆనందంలో మునిగితేలారు. ప్రస్తుత స్థితిగతులను వెల్లడించి, బ్యాచ్‌లో ఎవరికి ఏ కష్టం వచ్చినా, మిగిలిన వారంతా అండగా నిలవాలని తీర్మానించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన సూర్యచంద్రరావు మాస్టర్‌ని ఘనంగా సత్కరించారు.

క్రీడా స్ఫూర్తి.. సేవా దీప్తి



షార్ట్‌పుట్ పోటీల్లో త్రో చేస్తున్న గోపి

▲ అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగి సత్తా ▲ 'మానస క్రీడారత్న' పురస్కారం అందుకున్న గోపి ▲ సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర



ట్రెక్కింగ్‌లో జాతీయ జెండాను హిల్‌పై ప్రదర్శిస్తున్న గోపి, బృంద ప్రతినిధులు

అగనంపూడి: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు ఉక్కు ఉద్యోగి దుల్ల గోపి. ఓ వైపు అథ్లెటిక్స్‌లో రాణిస్తూనే.. మరో వైపు సేవా కార్యక్రమాల్లోనూ దూసుకుపోతున్నారు. జీవీఎంసీ 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలేనికి చెందిన గోపి ఉద్యోగిగా తన విధులు నిర్వహిస్తూనే మరో పక్క పలు క్రీడాంశాల్లో సత్తా చాటుతున్నారు. వీటికి తోడు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రశంసలు, బహుమతులు, అవార్డులు అందుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మరోపక్క తనకు ఇష్టమైన ట్రెక్కింగ్ చేస్తూ రికార్డులు నెలకొల్పారు.

సాధించిన పతకాలు

- కార్మిక దినోత్సవం సందర్భంగా 2014లో విజయవాడలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గోపి సత్తా చాటారు. వంద మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, డిస్కస్‌త్రోలో వెండి పతకం దక్కించుకున్నారు.
- 2015లో ముంబయ్‌లోని వాంఖడే స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ క్రీడాంశాల్లో ప్రతిభ కనబర్చి వెండి పతకాలు పొందారు.
- 2016లో బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్ విభాగాల్లో వెండి పతకాలు కైవసం చేసుకున్నారు.
- 2023లో కోల్‌కతాలో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా సంబరాల్లో పాల్గొని డిస్కస్ త్రోలో బంగారు పతకంతో పాటు రిలే పరుగు పందెంలో వెండి పతకాలతో మెరిశారు.



ఉత్తమ కోవిడ్ వారియర్‌గా ప్రశంసా పత్రం అందుకుంటున్న గోపి

- అదే ఏడాది ఝార్ఖండ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించారు. 400 రిలే పోటీల్లో వెండి పతకం దక్కించుకొని ఉక్కు ప్రతిభ చాటారు.
- 2018లో అప్పటి విశాఖ జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ చేతుల మీదుగా క్రీడా పురస్కారం అందుకున్నారు.
- 2019లో కేంద్రమంత్రి చేతుల మీదుగా జాతీయ స్థాయి మానస క్రీడా రత్న పురస్కారం స్వీకరించారు.
- 2021లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా ఉత్తమ కోవిడ్ ప్రచార రథసారథి పురస్కారం, 2022లో కోవిడ్ వారియర్ అవార్డు అందుకున్నారు.
- ట్రెక్కింగ్‌పై మక్కువతో పలుమార్లు ట్రెక్కింగ్ చేసి అనేక రికార్డులు సొంతం చేసుకున్నారు.

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నేడు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ కృష్ణ జన్మాష్టమిని వేడుకలను బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి శశి ఆదివారం తెలిపారు. బ్రహ్మకుమారీస్ శీలానగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శ్రీ సాయి వెంకటేశ్వర రెసిడెన్సీలో సోమవారం నాట్యాలు, ఆటపాటలు, ఉట్టికొట్టడం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'



విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయ అధికారి వెంకట రమణ

పెదగంట్యాడ: గ్రంథ పఠనంపై విద్యార్థుల్లో ఆసక్తి కల్పించేందుకు కృషి చేస్తున్నామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి వెంకటరమణ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించారు. అందులోని నీతిని వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు భక్తులకు వెండి ధనుర్బాణ దర్శనం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం భక్తులకు వెండి ధనుర్బాణ దర్శనం కల్పించనున్నారు. అయోధ్య శ్రీరామచంద్రుడుకి చెందిన ఈ ధనుర్బాణం ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. భక్తుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

చర్చి బోర్డు తొలగింపుపై ఆందోళన

కేబుల్ మూర్తికి వ్యతిరేకంగా నినాదాలు



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పెదగంట్యాడ: చర్చి బోర్డు తొలగించడాన్ని నిరసిస్తూ క్రైస్తవులు ఆదివారం ఆందోళనకు దిగారు. వారంతా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి)కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా క్రీస్తు సంఘం పెద్దలు మాట్లాడుతూ జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌కు వెళ్లే రహదారిలో క్రీస్తు సంఘం పేరిట 1987లో చర్చి ప్రారంభించామని తెలిపారు. చర్చికి సంబంధించి 20 ఏళ్ల కిందట బోర్డు ఏర్పాటు చేశామని వివరించారు. ఆ చర్చిలో సుమారు 200 కుటుంబాల వరకూ ప్రార్థనలు చేస్తున్నాయని తెలిపారు. అయితే ఆ చర్చికి సంబంధించిన బోర్డు పూర్తిగా పాడవ్వడంతో శనివారం కొత్త బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం ప్రార్థనలు చేసుకుంటున్న సమయంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి) ఉద్దేశపూర్వకంగా జీవీఎంసీ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. జీవీఎంసీ అధికారులు వచ్చి ఆ బోర్డు తొలగించారని చెప్పారు. రోడ్డు పక్కన ఎవరికీ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసిన బోర్డు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. దీనిపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది క్రైస్తవుల మనోభావాలను దెబ్బ తీసే చర్యగా అభివర్ణించారు. కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు తీరును ఎండగట్టారు. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి బోర్డును యథాస్థానంలో ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ పోలారావు, డాక్టర్ ఎస్.రాజారావు, విశ్వనాథం, నాగభూషణం, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి సమస్యలపై వినతి

అగనంపూడి: జీవీఎంసీ 85, 79 వార్డుల్లోని అగనంపూడి ప్రాంత సమస్యలు పరిష్కరించాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును స్థానిక నాయకులు వినతిపత్రంలో కోరారు. సెక్టార్–1 నిర్వాసితకాలనీల్లో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి అగనంపూడి జాతీయ రహదారి వరకు వీధి దీపాలు, అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు పనులు సత్వరం ప్రారంభించాలని కోరారు. నాయకులు బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సభలు జయప్రదం చేయండి

మధురవాడ: సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు విశాఖలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆదివారం సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మరుపిళ్ల పైడిరాజు, ఎం.మన్మథరావు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఠా, భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం చేయాలన్నారు. కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలపై దృష్టిసారించాలని కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి సంబరంలో విజ్ఞాన్ విద్యార్థులు



కృష్ణయ్య, రాధల వేషధారణలో బాలలు

అగనంపూడి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పలు విద్యా సంస్థల్లో బాలలు అలరించారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు పోటీపడి ఉట్టి కొట్టారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, డీన్ బి.సతీష్ మాట్లాడుతూ హైందవ నాగరికత, సాంప్రదాయాల్లో కృష్ణాష్టమికి ప్రత్యేకత ఉందన్నారు.

- అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాలలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని గోపికా కృష్ణుని వేషధారణలో బాలలు ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు పీఎం కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ పాల్గొన్నారు.
- 87వ వార్డు కణితి కాళింగ వీధిలోని డాలీ ప్లే స్కూల్‌లో ఉట్లు కొట్టే సంబరం నిర్వహించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధురి, శిరీష, సుధా, బేబీ పాల్గొన్నారు.

రన్ ఫర్ నో డ్రగ్స్ ర్యాలీకి విశేష స్పందన



అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న అతిథులు

గాజువాక: డ్రగ్స్ వల్ల అనర్థాలపై అవగాహన కల్పించడంలో భాగంగా పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 3కే ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. రన్ ఫర్ నో డ్రగ్స్ పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని పాతగాజువాక జంక్షన్ 60 అడుగుల రోడ్‌లో ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.శ్యాంబాబు ప్రారంభించారు. పాతగాజువాకం జంక్షన్ నుంచి గాజువాక మెయిన్ రోడ్‌లో సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక వరకు, తిరిగి కణితి రోడ్‌మీదుగా 60 అడుగుల రోడ్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్ మాట్లాడుతూ విశాఖ సిటీ ప్రజలు కాలుష్యానికి గురై ఇప్పటికే వివిధ జబ్బులతో బాధ పడుతున్నారని, దీనివల్ల వారిపై ఆధారపడ్డ కుటుంబాలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణా రహితంగా ప్రవర్తించి మానభంగాలు, హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు ప్రజల్లో చైతన్యం తేవడం కోసం ర్యాలీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్, వివిధ సంస్థలు, సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఎం.శివ గణేశ్వరరావు, పీఎస్ఎన్ మూర్తి, వినోద్ బాబు, గూడూరు సీతాలక్ష్మి, పల్లా అబిత, లత, గవర సోమశేఖర్, బండారు చందు, రమేష్, పామెల వసంత, పలక అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న యువకులు, విద్యార్థులు

నేత్ర పర్వంగా శ్రీవారి కల్యాణం

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో చాతుర్మాస దీక్షలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. శ్రీనివాస హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం వైభవంగా చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి ప్రధాన పండగ

గాజువాక: కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లి పండగను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహ పాత్రుడు, తిప్పల వంశీరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సూరిశెట్టి శివ, ఉత్సవ పర్యవేక్షకుడు మద్దాల అప్పారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు దొడ్డి రమణ, దొడ్ల జగదీష్, భీశెట్టి సింహాచలం నాయుడు, శరగడం కోటి, శరగడం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో కళాకారులు



సత్తెమ్మను దర్శించుకొంటున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు